పారిశుధ్యం.. అధ్వానం

- పేరుకుపోతున్న చెత్త కుప్పలు
- వ్యర్థాలతో నిండిన గెడ్డలు
- కానరాని తొలగింపు చర్యలు
- దుర్వాసన, దోమలతో ప్రజలు సతమతం


ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర వ్యర్థాలతో నిండిన రేసపువానిపాలెం గెడ్డ



రేసపువానిపాలెం రహదారిలో చెత్తతో నిండిన డస్ట్ బిన్, చుట్టూ పేరుకుపోయిన వ్యర్థాలు

సీతమ్మధార: జీవీఎంసీ 14, 24 వార్డుల్లోని పలు ప్రాంతాల్లో పారిశుధ్యం పడకేసింది. రహదారులు, పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. శానిటరీ అధికారుల పర్యవేక్షణ లోపం.. సిబ్బంది నిర్లక్ష్యంతో చెత్త కుప్పలు పేరుకుపోయాయి. డస్ట్ బిన్లు చెత్తతో నిండాయి. రోడ్ల వెంబడి వ్యర్థాలు దర్శనమివ్వడంతో స్థానికులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. దుర్వాసన భరించలేక సతమతమవుతున్నారు. చెత్త కుప్పల వద్ద వృద్ధి చెందిన దోమలు, ఈగలతో రోగాలు వస్తాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

- గురుద్వారా వెనుక రోడ్డులోని డస్ట్ బిన్‌లో చెత్త వేయకుండా దాని పక్కన పడేయడంతో ఆ ప్రాంతంలో దుర్వాసన వెలువడుతోంది. మూడు రోజులుగా ఈ సమస్య ఉన్నా.. పారిశుధ్య సిబ్బంది దృష్టి సారించలేదు.
- రేసపువానిపాలెం రహదారిలో ఏర్పాటు చేసిన డస్ట్ బిన్ వ్యర్థాలతో నిండిపోయింది. దాని చుట్టూ చెత్త విపరీతంగా పేరుకుపోయింది. పశువులు, కుక్కలు అక్కడ చేరి వాటిని చెల్లాచెదురు చేస్తున్నాయి. వాటి నుంచి భరించలేని దుర్వాసన వెలువడుతోందని స్థానికులు, పాదచారులు వాపోతున్నారు.
- సీతమ్మధార రైతుబజార్ పక్కనున్న రహదారిలో గల డంపర్ బిన్లు కూరగాయల వ్యర్థాలతో నిండిపోతున్నాయి.
- సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్ ఎదురుగా ఉన్న డస్ట్ బిన్లు చెత్తతో నిండాయి.

గెడ్డలు ఘోరం

24వ వార్డులో గెడ్డల్లో పెద్ద ఎత్తున్న పూడికలు పేరుకుపోయాయి. ముఖ్యంగా హైవే పక్కనున్న రేసపువానిపాలెం గెడ్డ ఘోరంగా తయారైంది. అన్ని రకాల ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర చెత్తాచెదారంతో ఈ గెడ్డ నిండిపోయింది. దీంతో మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. గెడ్డ పరిస్థితి ఇలా ఉన్నా.. పారిశుధ్య అధికారులు పట్టించుకోకపోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎప్పటికప్పుడు పూడికలు తొలగించకపోవడంతో దుర్గంధం, దోమల దాడులతో సతమతమవుతున్నామని వాపోతున్నారు. సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌కు ఆనుకుని ఉన్న గెడ్డలో ప్లాస్టిక్ బాటిళ్లు, సమీప చికెన్ షాపుల్లోని వ్యర్థాలు వేస్తున్నారు. దీంతో మురుగు నీరు నిలిచిపోయి దోమల వృద్ధి చెందుతున్నాయి.


సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్ రోడ్డులో చెత్తతో నిండిన డస్ట్ బిన్లు

జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు దృష్టి సారించి సకాలంతో చెత్త తొలగించాలని, గెడ్డలను పరిశుభ్రంగా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులు చర్యలు చేపట్టాలి

24వ వార్డులో డస్ట్ బిన్లు, గెడ్డలు చెత్తాచెదారంతో నిండిపోతున్నాయి. దోమలు, ఈగలు వృద్ధి చెంది జ్వరాల బారిన పడేస్తున్నాయి. జీవీఎంసీ పారిశుధ్య అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.
– జి.రమేష్‌కుమార్, నక్కవానిపాలెం

వార్డు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

మురళీనగర్: జీవీఎంసీ 49వ వార్డు సంపూర్ణ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ అల్లు శంకరరావు తెలిపారు. ఎన్‌జీజీవోస్ కాలనీ వైభవ్ పార్కు అభివృద్ధి పనులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డులోని ప్రతి కాలనీకి మౌలిక సదుపాయాలు కల్పించామని చెప్పారు. ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తెస్తే పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వైభవ్ పార్కులో రూ.5 లక్షలతో సందర్శకులు విశ్రాంతి తీసుకోవడానికి సిమెంటు బెంచీలు, పిల్లలకు ఆడుకోవడానికి క్రీడా సామగ్రి సమకూర్చడంతోపాటు వాల్ పెయింటింగ్స్ వేయిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్.రవికుమార్, ఎన్‌జీజీవోస్ కాలనీ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు జి.ప్రసాద్‌రావు, కార్యదర్శి కె.రామచంద్రరాజు, ఉపాధ్యక్షుడు డీఎస్ కృష్ణమోహన్, డైరెక్టర్ గుప్తా, ఎల్.నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రమౌళి, వేణు, భవాని శంకర్, కె.మున్న, శివరామప్రసాద్, కిషోర్, వెంకటరావు, రమేష్ పాల్గొన్నారు.


వైభవ్ పార్కు అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ అల్లు శంకరరావు

తండ్రికే కొడుకు టోకరా

- న్యాయం చేయమని ఏఆర్ ఎస్ఐ వేడుకోలు

మద్రిపాలెం: ఏఆర్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న తనకు అన్యాయం జరిగిందంటూ కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులకు కాపారపు దొంగబాబు తన గోడు వినిపించారు. వివరాలిలా.. బాపూజీనగర్ అంబేడ్కర్ కాలనీలో నివసిస్తున్న దొంగబాబుకు కొంతకాలం కిందట జరిగిన ఓ ప్రమాదంలో కాలు పోయింది. ఆయనతో అతడి కుమారుడు కొంత మొత్తం నగదు కోసం లోన్ పెట్టించాడు. కృత్రిమ కాలు పెట్టిస్తానని, విశాలాక్షినగర్‌లో వ్యాపారం కోసం షాపు పెట్టుకుంటానని, దానికి ష్యూరిటీ పెట్టమని తండ్రితో చెక్కుపై సంతకం పెట్టించుకున్నాడు. అంతటితో ఆగకుండా దఫదఫాలుగా తండ్రి ఖాతా నుంచి నగదు డ్రా చేసి ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేశాడు. ఈ క్రమంలో శనివారం ఏఆర్ ఎస్ఐ దొంగబాబు ట్రైసైకిల్‌పై కంచరపాలెం పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. సంగతి తెలుసుకున్న సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేరుగా బాధితుడి వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పై అధికారులతో మాట్లాడి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. బాధితుడు తన కొడుకు, కోడలిపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కంచరపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఏఆర్ ఎస్ఐ దొంగబాబు నుంచి వివరాలు తెలుసుకుంటున్న సీఐ విజయ్‌కుమార్

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.16.92 లక్షలు

సీతమ్మధార: ఆశీలమెట్టలోని సంపత్ వినాయగర్ ఆలయంలో శనివారం దేవదాయ శాఖ తనిఖీదారు ఎ.జగన్నాథం పర్యవేక్షణలో హుండీ ఆదాయం లెక్కింపు జరిగింది. 23 రోజులకు గాను రూ.16,92,807 నగదుతోపాటు 5.2 గ్రాముల బంగారం, 165 గ్రాముల వెండి విరాళంగా వచ్చింది. 31 యూఎస్ఏ డాలర్లు, 2 సింగపూర్ డాలర్లు హుండీ ఆదాయంగా వచ్చినట్లు ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్.బోళన్ తెలిపారు. శివజ్యోతి, వెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

బీఆర్‌టీఎస్ రోడ్డులో ప్రమాదకరంగా గొట్టాలు

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు 104 ఏరియా బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డులో జ్యోతినగర్ ఫుట్‌పాత్‌కు ఆనుకుని ఏర్పాటు చేసిన తడి, పొడి చెత్త డబ్బాల స్టీల్ గొట్టాలు విరిగి ప్రమాదకరంగా మారాయి. ఈ ప్రాంతంలో క్లాప్ వాహనాలు దుకాణాల వద్దకు వచ్చి చెత్త సేకరిస్తుండటంతో వీటి వినియోగం తగ్గింది. స్టీల్ డబ్బాలు దొంగలు పాలు కాగా.. వాటి గొట్టాలు నేలకొరిగేందుకు సిద్ధంగా ఉన్నాయి. వాటి వల్ల పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి తగు చర్యలు చేపట్టాలి.
– సి.ఈశ్వరరావు, బాపూజీనగర్


104 ఏరియా సర్వీస్ రోడ్డులో విరిగిన స్టీల్ గొట్టాలు, నేమ్ బోర్డు

వార్డుల్లో జోన్-5 కమిషనర్ పర్యటన

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42, 44 వార్డుల్లోని రైల్వే న్యూకాలనీ, అక్కయ్యపాలెం ప్రాంతాల్లో శనివారం ఉదయం జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ పర్యటించారు. చెత్త సేకరణ, ప్లాస్టిక్ నిషేధం అమలు, శానిటేషన్ సిబ్బంది పనితీరును ఆయన పరిశీలించారు. ఆయా వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.


రైల్వే న్యూకాలనీలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న జెడ్సీ కృష్ణ

సాధనతోనే సత్ఫలితాలు


జాతీయ జెండాకు అభివందనం చేస్తున్న విద్యార్థులు

సీతమ్మధార: నిత్య సాధనతోనే సత్ఫలితాలను సాధించవచ్చని సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ మనోజ్ జార్జ్ అన్నారు. స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్, ఎస్ఎఫ్ఎస్ స్కూల్ సంయుక్తంగా నెల రోజుల పాటు నిర్వహించిన నృత్య శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక రంగాల్లో చిన్నారుల ప్రతిభా పాటవాలును గుర్తించి వాటిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. 16 ఏళ్లలోపు బాలబాలికలను జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తున్న స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్.. ఈ నెల రోజుల్లో డ్యాన్స్ రాని చిన్నారులను సైతం చక్కని డ్యాన్సర్లుగా తీర్చిదిద్ది రెండు ప్రదర్శనలు ఇవ్వడం అభినందనీయమన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు మనోజ్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందించారు. వివిధ నృత్య ప్రదర్శనలతో చిన్నారులు అలరించారు. కార్యక్రమంలో వేసవి శిక్షణ తరగతుల కో–ఆర్డినేటర్ హిల్డా, కొరియోగ్రాఫర్ నాగరాజు పట్నాయక్, సహాయకుడు పల్లా శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం


గ్రంథాలయంలో విద్యార్థులకు సూచనలిస్తున్న దత్తి అప్పలనాయుడు

మురళీనగర్: పుస్తకాలు ఎంత ఎక్కువగా చదివితే అంత ఉన్నత ఆలోచనలు వస్తాయని గ్రంథాలయ సంఘం జిల్లా అధ్యక్షుడు దత్తి అప్పలనాయుడు అన్నారు. మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో శనివారం ఆయన పాల్గొని విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. కథలు చదవడంతోపాటు వాటిలోని నీతిని గ్రహించాలన్నారు. సాహితీవేత్తగా మారాలంటే సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలు చదవాలని సూచించారు. పైసా ఖర్చు లేకుండా మనకు అవసరమైన పుస్తకాలను అందించే లైబ్రరీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పద్యపఠనం పోటీలు, జనరల్ నాలెడ్జ్‌పై పోటీలు నిర్వహించి విజేతలకు కానుకలు అందించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ వై.పద్మజ, లక్ష్మి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణే ధ్యేయం

డాబాగార్డెన్స్: మానవ హక్కుల పరిరక్షణే ధ్యేయంగా పనిచేయాలని మానవ హక్కుల కౌన్సిల్ కార్యదర్శి ఎం.శ్యాంప్రసాద్ పిలుపునిచ్చారు. కౌన్సిల్ సభ్యులు, ప్రతినిధులకు క్రమశిక్షణ తప్పనిసరని పేర్కొన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో విధుల నిర్వహణకు సంబంధించి కౌన్సిల్ సభ్యులకు శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాధితులపై కౌన్సిల్ సభ్యులు బెదిరింపులకు పాల్పడితే చట్టపర చర్యలు తప్పవని హెచ్చరించారు. మానవ హక్కుల కౌన్సిల్ వలంటీర్లు తమకు తామే జవాబుదారీగా, నిజాయితీగా ఉండాలని, హక్కుల పరిరక్షణకు కట్టుబడి పని చేయాలన్నారు. ఈ నెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్. కోటలో వెయ్యికి పైగా మొక్కలు నాటనున్నట్టు శ్యాంప్రసాద్ చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్‌వీ రమణ, సూర్య, శ్రీనివాస్, ప్రసాద్, సీనియర్ సభ్యుడు గుండు అప్పలరాజు పాల్గొన్నారు.

వలంటీర్ల నిస్వార్థ సేవలకు గుర్తింపు

సీతంపేట: నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు సూచనల మేరకు 25వ వార్డులో అవార్డులకు ఎంపికైన వలంటీర్ల సత్కార కార్యక్రమం గణేష్‌నగర్ సచివాలయంలో శనివారం జరిగింది. ముఖ్య అతిథి జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ గణేష్‌నగర్, రాజేంద్రనగర్, మధురానగర్ పరిధిలోని 130, 131, 132, 133, 134 సచివాలయాల్లో వలంటీర్లకు సేవా మిత్ర, రత్న, వజ్ర పురస్కారాలు ప్రదానం చేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను, పౌర సేవలను అందించడంలో వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. వెలకట్టలేని సేవలకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పురస్కారం గౌరవమని, భవిష్యత్‌లో వలంటీర్లందరూ ఉత్తమ సేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏపీడీవో దుర్గాప్రసాద్, సచివాలయ కన్వీనర్లు సారిపిల్లి సంతోష్, పోతిబంతి హరికృష్ణ, బొమ్మాళి రవి, వానపల్లి లక్ష్మణ్, బోనుల జయ, ఉప్పాడ చంద్రశేఖర్, నంబూరి పద్మ, సచివాలయ అడ్మిన్లు, కార్యదర్శులు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


వలంటీర్లను సేవా పురస్కారాలతో సత్కరిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

కమనీయం.. శివపార్వతుల కల్యాణం

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు రామచంద్రనగర్‌లోని రామలింగేశ్వరాలయంలో 10వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఆలయ ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్ దంపతుల చేతుల మీదుగా ఈ మహోత్సవం జరిపించారు. అనంతరం భక్తుల సమక్షంలో తైనాల దంపతులు ప్రత్యేక పూజలు, శివలింగానికి అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా తైనాల విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ శివపార్వతుల కల్యాణం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, ఆలయ కమిటీ సభ్యులు పైడి నాగరాజు, కొప్పిశెట్టి సిమ్మారావు, పలిశెట్టి గణపతి, కొప్పిశెట్టి లక్ష్మణరావు, మట్టా సింహాచలం, ముప్పిడి రామారావు తదితరులు పాల్గొన్నారు.


రామలింగేశ్వరాలయంలో కల్యాణం జరిపిస్తున్న ధర్మకర్త తైనాల విజయ్‌కుమార్ దంపతులు

మరో గ్రంథాలయ ఉద్యమం అవసరం

సీతంపేట: గ్రంథాలయాల పరిరక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా బైకుపై సంచరిస్తున్న ఒంగోలుకు చెందిన మంచికంటి వెంకటేశ్వర్లు శనివారం ఉదయం నగరానికి చేరుకున్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయానికి వచ్చిన ఆయనకు లైబ్రరీ సహ కార్యదర్శి డి.వి.సూర్యారావు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఒంగోలులో బయలుదేరి రాయలసీమ అంతా పర్యటించి, కోస్తా జిల్లాల మీదుగా ఉత్తరాంధ్రకు వచ్చానని తెలిపారు. గ్రంథాలయాల పరిరక్షణ, అభివృద్ధికి మరో గ్రంథాలయ ఉద్యమం అవసరమన్నారు. ప్రజల వద్దకు పుస్తకం తన నినాదమని, సొంత డబ్బుతో పుస్తకాలు ముద్రించుకునే వారు లేక కొంత మంది రచయితలు నిరాశ, నిస్పృహలో ఉన్నారన్నారు. ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, వదాన్యులు, సేవా తత్పరులు గ్రంథాలయాలను ప్రోత్సహించాలని కోరారు. పాఠశాలల్లో గ్రంథాలయాలు పిల్లలకు దేవాలయాలని అభివర్ణించారు. రచయితల కోసం సహకార వేదికలు ఏర్పాటు కావాలని సూచించారు. తన పర్యటనలో అనుభవాలను వివరించారు. విశాఖ పౌర గ్రంథాలయం ప్రగతి అభినందనీయని, ఇతర ప్రాంతాల వారికి ఇది ఒక మంచి నమూనాగా పేర్కొన్నారు. మిత్ర సాహితి వర్మ, అరసం కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, మస్తాన్‌రెడ్డి, విశాలాంధ్ర బుక్ హౌస్ రాజు, కత్తి పద్మ తదితరులు వెంకటేశ్వర్లును అభినందించారు.



బైకు యాత్రికుడు వెంకటేశ్వర్లును అభినందిస్తున్న డి.వి.సూర్యారావు, సాహితీవేత్తలు

వాకర్స్ క్లబ్ సేవలు ఆదర్శనీయం


చెస్ పోటీల విజేతలతో ఉప్పలపాటి శుభ, క్లబ్ ప్రతినిధులు


సమావేశంలో పాల్గొన్న వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ సభ్యులు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ ఉప్పలపాటి శుభ అన్నారు. స్థానిక వాకర్స్ పార్కులో శనివారం సాయంత్రం నిర్వహించిన క్లబ్ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగించారు. మహిళలు, పిల్లల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు, పిల్లలకు, విద్యార్థుల మానసిక వికాసానికి దోహదపడే ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. క్లబ్ సేవా కార్యక్రమాలకు తన సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా నూతనంగా చేరిన సభ్యులకు వాకర్ పిన్, ప్యాట్రన్ మెడల్‌ను ఆమె అందించారు. ఈ నెలలో పుట్టిన రోజు జరుపుకుంటున్న వారిని చిరు కానుకలతో సత్కరించారు. 12 రోజులుగా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత చెస్ శిక్షణలో భాగంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను శుభ అందించారు. చెస్ కోచ్ ఎస్.ఉమాపతిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ కార్యదర్శి కె.ద్వారకానాథ్, వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్‌వీ సుధాకర్, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయాల్లో విశేష పూజలు

కంచరపాలెం: స్థానిక తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జ్యేష్ఠ మాస శుద్ధ చతుర్థశి శనివారం పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాతసేవ, విశేష పూజలు, పంచామృతా భిషేకాలు నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి పద్మావతి, అలివేలు మంగమ్మకు ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీ దళబిల్వార్చన, ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు, కార్యదర్శి రాజు నేతృత్వంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు.

సంపత్ వేంకటేశ్వరుడికి అర్చనలు

స్థానిక గొల్లకంచరపాలెంలోని కోదండ సీతారామ, ధనలక్ష్మి దేవి, సంపత్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఆలయ అర్చకుడు శ్యామ్ ఆచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వేంకటేశ్వరస్వామి పద్మావతి, అలివేలు మంగమ్మకు ప్రాతఃకాల తిరువారాధన, తులసీదళ బిల్వార్చనలు చేశారు. ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశారు. శ్రీరామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో ఆలయ కమిటీ సభ్యులు, సేవా దళ సభ్యులు ప్రసాద వితరణ చేశారు.


ప్రత్యేక పూజల్లో భక్తులు, అర్చకులు

క్లుప్తంగా

అనధికార పోస్టర్లు అంటించిన వ్యక్తి బైక్ సీజ్


అనధికార పోస్టర్‌ను తొలగిస్తున్న సిబ్బంది

సీతమ్మధార: జీవీఎంసీ గోడలపై అనధికారికంగా పోస్టర్లు అంటించిన ఓ వ్యక్తి బైక్‌ను సీజ్ చేసినట్లు టీపీఎస్ తేజేశ్వరరావు తెలిపారు. సీతమ్మధారలోని జీవీఎంసీ గోడలపై ప్రైవేట్ వ్యక్తులు అంటించిన పోస్టర్లను శనివారం సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా టీపీఎస్ మాట్లాడుతూ గోడలపై పోస్టర్లు అతికిస్తున్న వ్యక్తిని గుర్తించి అతడి బైక్(ఏపీ39బీపీ 7305)ను సీజ్ చేశామన్నారు. జీవీఎంసీ కమిషనర్ పదే పదే చెబుతున్నా.. అనుమతులు లేకుండా పోస్టర్లు అతికించడం తగదన్నారు. ఇటువంటి వాటికి పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున గొల్ల సన్నిధి సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిపారు. మధ్యాహ్నం 200 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 5.30 గంటలకు ఆకాశ దీపారాధన, రాత్రి 7 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు వైభవుడికి సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ద్విచక్ర వాహనం చోరీ

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ద్విచక్ర వాహనం దొంగతనానికి గురైంది. ఈ మేరకు క్రైం పోలీసులు తెలిపిన వివరాలిలా.. బాజీ జంక్షన్‌లో నివసిస్తున్న బాల అప్పలనాయుడు కంచరపాలెం సుభాష్‌నగర్‌లోని డీజిల్ లోకో షెడ్‌లో విధులు నిర్వహిస్తున్నారు. రోజూ మాదిరి గానే విధులకు వెళ్లి ఎప్పుడు పెట్టిన ప్రాంతంలోనే తన బైక్‌ను పార్క్‌చేశాడు. తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో చూసేసరికి వాహనం కనిపించలేదు. దీంతో పోలీసులకు శనివారం అప్పలనాయుడు ఫిర్యాదు చేశారు. క్రైం సీఐ దుర్గాప్రసాద్ నేతృత్వంలో ఎస్ఐ సునీల్ కేసు దర్యాప్తు చేపట్టారు.

రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి


రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘ నాయకులు

తాటిచెట్లపాలెం: రాష్ట్ర బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఓటర్లు ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో వారికే సీట్లు కేటాయించి రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని, సంఘాల సత్తా చూపేందుకు ప్లీనరీ సమావేశాలు నిర్వహించాలని తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సానబోయిన రామారావు మాట్లాడుతూ రద్దు చేసిన అన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ప్రభుత్వం పునరుద్ధరించాలన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ స్థానిక స్వపరిపాలన సంస్థల్లో బీసీలకు ప్రస్తుతం ఉన్న 24 శాతం రిజర్వేషన్లను 34 శాతానికి పెంచాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో జేబీ రాజు, తుమ్మిడి రామ్‌కుమార్, కట్టా మల్లేశ్వరరావు, ఎల్.వి.ప్రసాద్, కె.కె.సంజీవరావు, బి.జార్జ్ ఆంటోని, గూడూరి సీతామహాలక్ష్మి, సీతాల్ తదితరులు పాల్గొన్నారు.